కథానిక

# కళారాధకుడు

బి. సూర్యనారాయణ

సాయంత్రం ఏడు గంటలవస్తోంది, అంతవరకు కళను గురించి వుపన్యాసమిచ్చిన వెంకట్రావు ఇంటిదారిపట్టి నడుస్తున్నాడు. చీకటి పడడంమూలంగాను, పైగా తనయింటికి ఆ దారిని నడవడం అదే క్రొత్తవడంవల్లనూ, కొద్దిగా నడకను వడిచేశాడు. ప్రక్కపొలాల్లోని కీచురాళ్ల ధ్వని, వాటిప్రక్కన గుడిసెల ముందున్న దోమల రాగాలు తప్ప ప్రకృతంతా నిశ్శబ్దంగా వుంది. కొద్దిదూరం అలా ముందుకు నడిచాడు. ఇంతలో ఏదో గుప్పున వాసనకొట్టింది. ఛటాలున ఆగి ప్రక్కకు తిరిగి చూచాడు. ఎవరో ఆసామీ ఒక పెద్దగుడిసెముందు కూర్చుని చిల్లర డబ్బులు లెక్క పెట్టుకుంటున్నాడు. ఇతణ్ణి చూడగానే ఆ వ్యక్తి ఆశ్చర్యపడ్డట్లు లేచి మెల్లిగా ఇతనివైపుకు నడిచాడు.

"ఎవరండీ బాబయ్యా", డబ్బుల సంచి మూటకడుతూ విధేయతతో ప్రశ్నించాడు.

వెంకట్రావు కొద్దిగా తటపటాయించాడు. తానెవరినని చెప్పుకోను? ●

"నేనొక కళారాధకుణ్ణి. ప్రయత్నంతో అన్నాడు.

"అదేం వుద్యోగం బాబయ్యా" అమాయకంగా అతని బుర్రమీసాల్లోంచి ప్రశ్నించాడు ఆ ఆసామీ.

వెంకట్రావు ఆ ప్రశ్నసరణికి తనలో తానే నవ్వుకున్నాడు. దేశమంతా ప్రసిద్ధికెక్కిన తాను ఒక సామాన్య వ్యక్తికి తెలియకపోవడమా?

"అంటే బొమ్మలు గీచేవాణ్ణన్నమాట" ఇంతకన్నా సులువుగా అతని కర్థమయ్యే మాటలతనికి గోచరించలేదు.

"అదా, నేనేంటో ననుకుండాను" ఆసామి ఫక్కున నవ్వాడు. ఆనవ్వు యెందుకో ఇతనికి చెంపపెట్టు పెట్టినట్లయింది.

"అట్లావచ్చి కూసోండి బాబయ్యా, అలాగే నిల్సుండిపోయారేం" ఆప్యాయంగా ఆహ్వానిస్తూ అన్నాడు.

వెంకట్రావు ఇదంతా విన్పించుకోలేదు. ఒకపర్యాయం ఆప్రాంతంచుట్టూ కలియచూచాడు, వాతావరణం ఇక్కడ మరీ నిశ్శబ్దంగా వుంది. దూరంగా ఒక యెముకముక్కకోసం కొబోలు రెండు కుక్కలు పోట్లాడుకుంటున్నై.

తేరుకుని ప్రశ్నించాడు "ఇదుగో అబ్బీ, మీరెవరూ?"

"ఏదో పని పాటలు చేసుకుండోళ్ళం బాబయ్యా, అదో ఆ కనపడేది నా కసాయి దుకాణం. ఇవన్నీ మా తండోళ్ళ గుడిసెలు. ఏం బాబయ్యా అలా అడిగారు."

అతడు ఒక పర్యాయం తల పంకించి "ఆ- ఏమీలేదు...వస్తాను" అని మరి కొంత వడిగా నడవడం ప్రారంభించాడు. అప్పటికే ఆ గుడిసెలవాండ్లంతా మంచాలమీదికి చేరారు. నిద్రపొయ్యేవాండ్లు గుర్రుపెట్టి నిద్రపోతున్నారు. కొందరు ఏదో పిచ్చాపాటి మాట్లాడుకుంటున్నారు. ఆ ప్రాంతంమాత్రం చాలా సందడిగా వుంది. వీళ్ళకీ ప్రపంచంతో సంబంధమేలేదేమోననిపించింది. మొత్తంమీద అతని కదొక నరకప్రాయంగా గోచరించింది. రెండు మూడు కుక్కలు యితని వెంటపడి గోలచేసి విసిగి వెళ్ళిపోయాయి.

వెంకట్రావు వడివడిగా వీధి మెట్లెక్కి తపతపా తలుపుకొట్టాడు. లోపలవున్న శారద తలుపు తెరిచింది. ఇల్లంతా చీకటిమయం.

"ఉదయం వెళ్ళి, ఇప్పుడా రావడం. ఇంతవరకేం చేస్తున్నారు" తలుపు తెరుస్తూనే అడిగిన ఆమె ప్రశ్నల కితడేమీ జవాబివ్వలేదు. ఆ మాట లంటున్న శారద కన్పించనట్లుగానే, ఆ మాటలు సహితం వినిపించినట్లు లేదు. కాని

అతడేం చేసింది, చేస్తున్నది, చేయబోయేది, చేయగలిగిందీగూడా ఆమెకు తెలుసు.

"దీపం ముట్టించలేదేం" అన్నాడు లోపలికి అడుగు వేస్తూ.

"కిరసనాయిల్ లేదు" ముక్తసరిగా జవాబిచ్చింది. "అయితే ఆముదం దీపం ముట్టించు" అన్నాడు సరాగంగా.

"ఆముదం మాత్ర మెక్కడుంది."

"వంటాముదం లేదూ" కొద్దిగా తీక్షణంగా అన్నాడు.

"ఈ వరుస మరీ బాగుంది. రేపు పిల్లవాడి వుగ్గుకే చాలీ చాలనట్లుగా వుంది."

"రేపటిమాట తర్వాత చూచుకుందాం గాని, ముందు దీపం వెల్గించు" చిరాకుగా అన్నాడు. నిజమే, దినగండం నూరేళ్లాయుష్యగా వున్న అతనికి రేపటిమాటే లేదు.

"ఏమో బాబూ, పిల్లవాడి నోటికుందుది తీసి నిప్పు పెట్టలేను. మీరే వెల్గించుకోండి" దీనితో అతని అరికాలిమంట తల కెక్కింది.

"నన్నట్టే విసిగించక దీపం ముట్టిస్తావా? లేదా?" గద్దించాడు.

శారదిక కిక్కురు మనలేదు. మనిషి నీలువునా దిగజారినట్లుంది పాపం! ఏదో గొణుగుతూ వెళ్ళి రెండు ప్రెమిదలలో ఆముదం పోసి వెల్గించింది.

గది మధ్య నిశ్చలంగా వెల్గుతున్న దీపపు కాంతి దానికొక వింతశోభ నిచ్చింది. అదంతా యదార్థానికి కళామయంగా వుంది. గది గోడల మీద అతడు గీచిన ప్రతి పటంలోను కళాదేవి ప్రస్ఫుటంగా వికాసిస్తూంది. ఒక మూలగా పాత మేజా దానిమీద కాలికాలి చల్లారి కరడుకట్టిన వత్తిలో దీపపు ప్రమిద, దాని ముందు రెండు మూడు మొండి పెన్సిళ్లు, ఒక తలలేని కలం, ఆ బల్ల ముందొక చెయ్యి విరిగిన కుర్చీ, ఇవన్నీ గది శోభను కొంత పరిహసిస్తున్నాయి. గోడమీది "కళ కళకోసమే" అని రాసివున్న పెద్ద అక్షరాలు ఆ కాంతిలో నవ్వుతున్నాయి.

వెంకట్రావు అక్కడ పడివున్న యెంగిలి సిగిరెట్లలో పెద్ద దొకటి యేరి నోట్లో పెట్టుకుంటూ అన్నాడు "ఇవ్వాళ మనియార్డరేమైనా వచ్చినయ్యా."

"లేదు. రెండు మూడు పత్రికల దగ్గర్నించి ప్రశంశలు మాత్రమొచ్చాయి." కాసేపాగి తిరిగి అంది, "మరిచిపొయ్యాను మీతమ్ముడిదగ్గర్నించి వుత్తరంగూడా ఒకటి వచ్చింది. రేపు రెండవ తేదీకి కాలేజీ జీతం కట్టకపోతే పేరు కొట్టేస్తారట" అంటూ ఆమె దీపం తీసుకొని లోపలి కెళ్ళింది.

అతనికి మూల్గే నక్కమీద తాటికాయ పడ్డట్టయింది.

"పిల్లవాడికి పాల డబ్బీ తీసుకురాలేదు గదూ!" లోపలినుంచి తిరిగి వినిపించింది.


"ఏం పెట్టి తేను" దీనంగా అన్నాడు.

ఆ విషయాన్ని గురించి ఆమె మరేమీ మాట్లాడలేదు. అసలు శారద దగ్గరున్న విశేషమదే. అలాంటి పరిస్థితుల్లో అతనికి కష్టాన్ని కల్గించే యేమాట అనదు. పైపెచ్చు కొంత ధైర్యాన్ని కల్గించడంగూడా ఆమెకు పరిపాటి.

"వడ్డించాను రండి" అని లోపలినుంచి కేక విన్పించేసరికి అతడు చొక్కా విడిచి లోపలి కెళ్ళాడు. అన్నం ముందు కూర్చున్నాడే కాని, అతనికి మెతుకు మ్రింగుడు పడలేదు. పోనీ శారద బుజ్జగించి పెట్టడానికైనా వున్న వేమీ లేవు. పచ్చడి, మజ్జిగతో యిద్దరూ భోజనాలు ముగించి యివతలికొచ్చారు.

శారద అతనికి పక్కవేసి తాను వెళ్ళి పిల్లవాడి ప్రక్కలో పడుకుంది.

వెంకట్రావు జిజ్ఞాసగా తల నటు త్రిప్పి పడుకున్నాడు. పాపం! శారదను చూస్తే తనకు

జాలివేస్తుంది. ఆమె కాపురాని కొచ్చినప్పట్నుంచి, తన మూలంగా తనతో పాటు ఆమె అనుభవించని దరిద్రం లేదు. చిన్నప్పుడు పుట్టింట్లో యేం సుఖపడిందో యేమో. అప్రయత్నంగా అతని కండ్లవెంట, రెండు బాష్పబిందువులు రాలాయి. చొక్కాతో కండ్లు తుడుచుకొని లేచి కూర్చున్నాడు. పగలల్లా పనిచేసి అలసిన శారద ప్రశాంతంగా నిద్రపోతూంది. ఆమె కౌగిట్లోని పిల్లవాడు నిద్రలోనే వ్రేళ్లు చీక్కుంటున్నాడు. ఏదో ఆలోచన తట్టినట్లు ఛటాలున లేచి బల్లదగ్గతికెళ్ళాడు. పుస్తకంలోని కాగితంచింపి యేమిటో వ్రాయపోయాడు. కలం వ్రాయలేదు. విదిల్చాడు. అందులో సిరాలేదు. ప్రక్కన వున్న సిరాబుడ్డి వంచాడు. అదిఖాళీ. చేతిలోనిపుస్తకం నేలమీద కొట్టి కొంత కోపం తీర్చుకున్నాడు. ఇంతలో చమురు లేక దీపం ఆరిపోవడానికుపక్రమించింది. అతడు చరచరా నడిచి వెళ్లి పడుకొని దుప్పటి కప్పుకున్నాడు. నిద్రపట్టలేదు. మనస్సు పరిపరివిధాల పోయింది. జీవితంమీదనే చివరకి విరక్తి తోచింది. కండ్లు మూసుకొని వెక్కి వెక్కి యేడ్చాడు. "పిచ్చివాడా, నీకళ, కళారాధన యెవడికి కావాలి. నీ చాదస్తంతో నిన్నే కాకుండా, నీ యిల్లాలని సహితం కృశింప చేసుకుంటున్నావు. నీ ఆశయాలకోసం ఆమెను కష్టపెట్టడానికి నీకేమధికారముంది" అంతర్వాణి విచిత్రంగా భోరున విలపించింది.

"ఎవరికోసం యీ కళారాధన, ఎవరినుద్ధరించను?" అకస్మాత్తుగా మళ్లీ ప్రశ్నించింది. దానికి వెంటనే అతనికి సమాధానం దొరకలేదు.

"ఏం, చెప్పవేం? ఎవరికోసం?" తిరిగి గద్దించింది. అతడు త్రుళ్లి పడ్డాడు. అతనిలోని మానవత్వం ఒక్కుమ్మడి ఉప్పొంగింది.

దీర్ఘంగా ఆలోచించాడు "సర్వజన సౌభాగ్యంకోసం" కళాదేవి నవ్వుతూ సమాధానమిచ్చింది.

"సౌభాగ్యం,!" అతనిలోని మానవత్వం వికారంగా నవ్వింది.

"అదిగో, ఆ ఆసామిని చూడు. వాండ్లకు కావలసింది కడుపుకు తిండా, కళా?" ఈసారి తీక్షణంగా ప్రశ్నించింది.

మానవుడు కొంత తేరుకున్నాడు. "నీమను గడకే ఆస్కారంలేని కళ నీ కెందుకయ్యా? ముందు నీవు, తర్వాత నీకళ, ఏం? అంతేనా?

దూరంగా, నక్క అరవడంతో కెవ్వున కేకవేసి లేచికూర్చున్నాడు. ఈ కేకతో శారద దిగ్గునలేచి ఇతని మంచంమీద వచ్చిపడింది. ఇతనికి ముచ్చెమటలూ పోశాయి. ఆ మెను అమాంతం కౌగలించుకొని మంచంమీద పడిపోయాడు.

* * *

వెంట్రూవుకు వచ్చిన జ్వరం మూడు రోజుల వరకు తీయలేదు. మూడోనాటికి అతని ముఖమంతా వివర్ణమయింది. పరామర్శించడానికి వచ్చిపోయే స్నేహితులకు, పెద్దలకూ అంతు లేదు. నాలుగవ దినాంతంలో జ్వరపు తీవ్రత మరీ హెచ్చింది. అతనిలోని ప్రతి నాడి "కళ కళకోసం" అంటూ అధికతర వేగంతో క్రమాను గతిని కొట్టుకున్నాయి. శారద యితని మంచంప్రక్కనే క్రిందపడి పసిపిల్లలే దొర్లుతూ గోలుగోలున అల్లాడింది. ఆ గోడులో యీనాడుల జపం వినిపించలేదు. ఆ ధ్వనితో పోటీ చేయలేని నిరుత్సాహంతో కాబోలు, నాడుల ఆక్రందనం పలచపడింది. కళాకారుడు కన్ను మూశాడు. మరి ఇక తెరవనేలేదు పాపం!

ఈవార్త అనలానికిమల్లే అన్నిప్రాంతాలకు ఇట్టే ప్రాకిపోయింది. కంటినీరు విడువని భారతీయుడు లేడు. వార్తాపత్రికలన్నీ పెద్దపెద్ద శీర్షికలలో నిర్విరామంగా పది దినాలపాటు ఇతని కుటుంబంపట్ల సానుభూతిని చూపిస్తూ విలపించాయి.

స్మారకనిధికి గాను పది దినాలలో యిరవై వేల రూపాయలవరకు చందా వసూలు చేయబడింది. ఆ డబ్బుతో కళా మందిర మొకటి యితని స్మారక చిహ్నంగా నెలకొల్పబడింది.

అందులో స్వాగతోపన్యాసంచెపుతూ ఇలా అన్నాడు ఆవూరి పెద్ద, "మొత్తానికి మనం సంతోషించాలి. ఆశయాలను చచ్చయినా సాధించాడు."

"చచ్చేనా సాధించేది" అన్నట్లు ఆమందిరం ప్రశ్నార్థకంగా ప్రతిధ్వనించింది.